# 'కొత్త' ఆశలు.. కిక్కిరిసిన దేవాలయాలు

- నగరంలోని ప్రధాన దేవాలయాల వద్ద బారులు తీరిన భక్తులు


బంజారాహిల్స్‌లోని జగన్నాథ దేవాలయం వద్ద భక్తుల రద్దీ


జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి వద్ద భక్తుల కోలాహలం

**జూబ్లీహిల్స్, జనవరి 1, ప్రభాతవార్త:** కొత్త ఏడాది మొదటి రోజును పురస్కరించుకొని నగరం ఆధ్యాత్మిక కాంతులతో వెలిగిపోయింది. కొత్త ఏడాదిని భగవంతుడి సన్నిధిలో ప్రారంభించాలనే భావనతో నగరంలోని ప్రధాన దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూతన సంవత్సరం నేపథ్యంలో ఉదయం నుంచే నగరంలోని ప్రధాన ఆలయాల వద్దకు భక్తులు బారులు తీరారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొనేందుకు తరలివచ్చారు. బిర్లా మందిర్ వెంకటేశ్వరస్వామి, చిలుకూరు బాలాజీ ఆలయం, ఇస్కాన్ దేవాలయం, కర్మాన్‌ఘట్ హనుమాన్ దేవాలయం, జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయం, జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయం, సంఘీ దేవాలయం, కాచీగూడలోని పద్మనాభస్వామి ఆలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయం, ఉజ్జయిని మహంకాళి దేవాలయం, ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానం, బంజారాహిల్స్‌లోని జగన్నాథ దేవాలయం, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయంతో పాటు పలు దేవాలయాలు భక్తుల రద్దీతో నిండిపోయాయి. బంజారాహిల్స్‌లోని జగన్నాథ ఆలయం, జూబ్లీహిల్స్‌లోని టీటీడీ, పెద్దమ్మతల్లి దేవాలయాలు, చిలుకూరు బాలాజీ, బిర్లా దేవాలయాలకు భక్తులు పోటెత్తడంతో ట్రాఫిక్ సమస్యలు సైతం తలెత్తాయి. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


బిర్లా మందిర్ వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

## ఖైరతాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**జూబ్లీహిల్స్, జనవరి 1, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం ఉదయం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో ఉన్న బస్తీలో పర్యటించారు. బస్తీ ప్రజల బాధలను నేరుగా గుర్తించి వాటికి పరిష్కారించేందుకు ప్రయత్నించారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ఆయన హిమాయత్‌నగర్ డివిజన్‌లోని అవంతినగర్, గాంధీనగర్, సోమాజీగూడ డివిజన్‌లోని బస్తీల్లో పర్యటించారు. పలు విభాగాలకు చెందిన అధికారులతో కలిసి ఆయన బస్తీవాసులతో సమావేశమయ్యారు. బస్తీలో నెలకొన్న సమస్యలను బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను అధికారులతో కలిసి సమీక్షించిన ఆయన అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలిచ్చి పరిష్కరించే ప్రయత్నం చేశారు. గాంధీనగర్‌లో నూతన సామాజిక భవనం నిర్మాణం చేపట్టడానికి ఆయన బస్తీవాసులకు హామినిచ్చారు. అవంతినగర్‌లో వీధిదీపాల సమస్యను బస్తీవాసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన వెంటనే జీహెచ్ఎంసీ వీధిదీపాల విభాగ అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని సూచించారు. బస్తీల్లో నీటి పైపులైన్ల లీకేజీ సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, వరదనీటి కాలువల సమస్యలను బస్తీ వాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీధి నంబరు 17. 18తోపాటు రాజా మొహల్లలో వరదనీటి పైపులైన్ల లీకేజీ సమస్యకు చెక్ పెట్టాలని ఆయన అధికారులకు సూచించారు. సోమాజీగూడ డివిజన్‌లోని బస్తీలో ఉన్న సమస్యలను సైతం స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


సోమాజీగూడ డివిజన్‌లో పర్యటిస్తున్న కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి తదితరులు.

# రూపు రేఖలు మారిన హైదరాబాద్ కమిషనరేట్

-ఉత్తర మండలం నుంచి పలు పోలీసు స్టేషన్లు మల్కాజిగిరి కమిషనరేట్‌లో విలీనం
-సైబరాబాద్ నుంచి కొన్ని పోలీసు స్టేషన్లు హైదరాబాద్‌కు బదలాయింపు
-ఏడు జోన్లు యధాతథం...జోన్ల పేర్లు మార్పు...సౌత్, ఈస్ట్ జోన్ ఎత్తివేత...
-అంబర్‌పేట్ కేంద్రంగా సికింద్రాబాద్ జోన్



**హైదరాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ రూపురేఖలు మారాయి. ఇప్పుడున్నట్లుగా ఏడు జోన్లు వున్నా వీటి పేర్లను మార్చివేశారు. సైబరాబాద్ నుంచి కొన్ని పోలీసు స్టేషన్లను హైదరాబాద్‌కు బదలాయించగా మరికొన్నింటిని హైద రాబాద్ నుంచి మల్కాజిగిరి (ఇదివరకటి రాచకొండ కమిషనరేట్) కమిషనరేట్‌లోకి మార్చారు. పాతబస్తీలోని పురానిహవేలిలో ఇప్పు దున్న దక్షిణ మండలం కార్యాలయంలో చార్మినార్ జోన్ డిసిపి విధులు నిర్వహిస్తారు. ఈ జోన్ పరిధిలో చార్మినార్, మలక్‌పేట్, మీ ర్‌చౌక్, సైదాబాద్, సంతోష్ నగర్ డివిజన్లు వుండగా వీటి పరిధిలోని 16 పోలీసు స్టేషన్లు వుంటాయి. సైదాబాద్ చౌరస్తాలో గల సౌ త్..ఈస్ట్ జోన్‌ను ఎత్తేశారు. మూడేళ్ల క్రితమే ఈ జోన్ ఏర్పాటవగా దీనిని తాజాగా రద్దు చేశారు. ఈ జోన్ పరిధిలోని పోలీసు స్టేషన్లను కొన్నింటిని చార్మినార్ జోన్‌లో ఇంకొన్నింటిని కొత్తగా అందుబాటులో వచ్చిన రాజేంద్ర నగర్ జోన్‌లో కలిపారు. మొహదీపట్నం చౌరస్తాలో గల దక్షిణ, పశ్చిమ డిసిపి కార్యాలయం నుంచి గోల్కొండ జోన్ ఏర్పాటవనుండగా ఇక్కడి నుంచి డిసిపి విధులు నిర్వహి స్తారు. ఈ జోన్‌లో ఆసిఫ్‌నగర్, గోషామహల్, కుల్సుంపురా, టోలిచౌకి డివిజన్లు వుండగా వీటి పరిధిలోని 14 పోలీసు స్టేషన్లు వుం టాయి. ఖైరతాబాద్ 1 జోన్ ఎసి గార్డ్స్ వద్ద గల పశ్చిమ మండల కార్యాలయం నుంచి పనిచేయనుంది. ఈ జోన్ పరిధిలో బంజా రాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్ నగర్ డివిజన్లు వుండగా వీటి పరిధిలోని ఏడు పోలీసు స్టేషన్లు వుంటాయి. ఖైరతాబాద్ 2 జోన్ కా ర్యాలయం పబ్లిక్ గార్డెన్స్ వద్ద గల సెంట్రల్ జోన్ కార్యాలయం నుంచి పనిచేయనుంది. ఈ జోన్ పరిధిలో అబిడ్స్, పంజాగుట్ట, సై ఫాబాద్, సుల్తాన్‌బజార్ డివిజన్లు వుండగా వీటి పరిధిలోని ఎనిమిది పోలీసు స్టేషన్లు వుంటాయి. సైబ రాబాద్‌లో ఇప్పటి వరకు కొన సాగి తాజాగా హైదరాబాద్‌లో విలీనమైన రాజేంద్రనగర్ జోన్‌లో హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణ గుట్ట, ఫలక్‌నుమా, ఇదివ రకు సైబరాబాద్‌లో వున్న రాజేంద్రనర్ డివిజన్లు వీటి పరిధిలోని పది పోలీసు స్టేషన్లు వుంటాయి. ఈ జోన్ రాజేంద్రనగర్ వెటర్నరీ కాలేజిలో గల రాజేంద్ర నగర్ డిసిపి కార్యాలయం నుంచి పనిచేస్తుంది. సైబరాబాద్ పరిధిలో ఇంతకాలం వున్న శంషాబాద్ జోన్ హై దరాబాద్‌లో విలీనం కాగా ఇందులోని ఆర్‌జిఐఎ, ఆదిబట్ల డివిజన్‌లు వీటి పరిధిలోని ఐదు పోలీసు స్టేషన్లు వుంటాయి. ఈ జోన్ శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీసు స్టేషన్‌లోని శంషాబాద్ డిసిపి కేంద్రం నుంచి పనిచేస్తుంది. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఇదే బుల్లి జో న్. శంషాబాద్ విమానాశ్రయంతో సమీప గ్రా మాలు ఈ జోన్ పరిధిలో వుంటాయి. కాగా సికింద్రాబాద్ పేరిట ఏర్పాటైన కొత్త జో న్ అంబర్‌పేట్‌లో గల తూర్పు మండల కార్యాలయం నుంచి పనిచేసే వీలుంది. ఈ జోన్ పరిధిలో చిక్కడపల్లి, చిలకలగూడ, గాంధీ నగర్, మహంకాళి, ఉస్మానియా వర్సిటీ డివిజన్లతో పాటు వీటి పరిధిలోని 14 పోలీసు స్టేషన్లు వుంటాయి. ఇక ఇంతకాలం హైదరా బాద్ కమిషనరేట్‌లో వున్న బేగంపేట్, తిరుమల్‌గిరి, తుకారంగేట్, కార్ఖాన, మారెడ్‌పల్లి పోలీసు స్టేషన్లు మల్కాజిగిరి కమిషనరేట్‌కు బదలాయించారు. ఇక సైబరాబాద్‌లో ఇంతకాలం కొనసాగిన మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల సహా మరో రెండు పోలీసు స్టేషన్లు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లో విలీనం అయ్యాయి. సంగారెడ్డి పరిధిలోని పటాన్చెరు డివిజన్‌లో గల కొన్ని పోలీసు స్టేషన్లు సైబరాబాద్‌కు, సైబరాబాద్ పరిధిలో ఇంతకాలం వున్న మేడ్చల్ జోన్‌లోని మరికొన్ని పోలీసు స్టేషన్లు మల్కాజిగిరి కమిషన రేట్‌లో మారాయి. సైబరాబాద్ కమిషనరేట్ ఇప్పుడున్నట్లుగానే గచ్చిబౌలిలో, మల్కాజిగిరి కమిషనరేట్ ఏఎస్‌రావు నగర్‌లోని రాచకొ ండ కమిషనరేట్ కార్యాలయంలో కొనసాగనుంది. ఈ రెండు కమిషనరేట్లలో మూడేసి జోన్లు వుండనున్నాయి. కాగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కొంగరకలాన్‌లో గల రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు కానుంది. ఈ కమిషనరేట్‌లో ప్రస్తుతానికి రాచకొండ పరిధిలోని మహేశ్వరం డిసిపి జోన్‌తో పాటు సైబరాబాద్‌లోని షాద్‌నగర్ డివిజన్, రాజేంద్రనగర్ జోన్‌లోని కొన్ని పోలీసు స్టేషన్లు కలిపి మొ త్తం 22 పోలీసు స్టేషన్లను కేటాయించారు.

### హైదరాబాద్ పరిధిలోని పోలీసు స్టేషన్ల తొలగింపుపై వివాదం

ఇదిలావుండగా ఇంతకాలం హైదరాబాద్ పరిధిలో వున్న బేగంపేట్, తిరుమల్‌గిరి, కార్ఖానా, మారెడ్‌పల్లి, తుకారంగేట్ పోలీసు స్టేష న్లు ఇకముందు మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో వుంటాయి. ఇందులో ఇతర పోలీసు స్టేషన్ల సంగతి ఎలావున్నా బేగంపేట్ హైద రాబాద్‌లోనే వుండగా విమానాశ్రయం కూడా ఇక్కడే వుంది. ఎక్కడో శంషాబాద్‌లో వున్న విమానాశ్రయ భద్రతను హైదరాబాద్ పరి ధిలోకి తెచ్చిన సర్కారు బేగంపేట్‌ను మల్కాజిగిరిలో విలీనం చేయడం గమనార్హం. దీంతో పాటు దీని పక్కనే వున్న తుకారంగేట్ సహా ఇతర పోలీసు స్టేషన్ల మా ర్పుపైనా ఆయాబస్తీల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు.





# మారనున్న 'భాగ్యనగరం' ముఖచిత్రం

-మూడు కార్పొరేషన్లుగా జిహెచ్ఎంసి
-హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి
-నేడో రేపో అసెంబ్లీలో ప్రకటించనున్న ప్రభుత్వం.!

**హైదరాబాద్, జనవరి 1,ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగర పాలనలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకుని పౌర సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించేందుకు రంగం సిద్ధం చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన 2071 చదరపు కిలోమీటర్ల కోర్ అర్బన్ రీజియన్ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఒకట్రెండు రోజుల్లోనే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై అధికారిక స్పష్టత రానుంది. ప్రభుత్వ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ స్థానంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు కొత్త కార్పొరేషన్లు కొలువుదీరనున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నగర గుండెకాయ వంటి ప్రాంతాలను కలిగి ఉండనుంది. సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట నుంచి శంషాబాద్ వరకు విస్తరించి.. మొత్తం 150 డివిజన్లతో ఏర్పాటు కానుంది. పాతబస్తీ, సెంట్రల్ హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. ఐటీ హబ్‌గా పేరుగాంచిన పశ్చిమ హైదరాబాద్ ప్రాంతమంతా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది. నార్సింగి నుంచి శామీర్‌పేట జీనోమ్ వ్యాలీ వరకు 74 డివిజన్లతో ఇది ఏర్పాటు కానుంది. ఉత్తర, తూర్పు హైదరాబాద్‌ను కలుపుతూ కీసర నుంచి పెద్ద అంబర్‌పేట వరకు 76 డివిజన్లతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడనుంది. కొత్తగా ఏర్పడే సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కోసం ప్రభుత్వం 10 ఎకరాల చొప్పున కేటాయించి అత్యాధునిక భవనాలను నిర్మించనుంది.

**ఏ కార్పొరేషన్ పరిధిలోకి ఏ ప్రాంతాలు?**

హైదరాబాద్ కార్పొరేషన్ చార్మినార్, ఫలక్‌నుమా, కోఠి, అబిడ్స్, నాంపల్లి, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, శంషాబాద్, బడంగ్‌పేట వంటి ప్రాంతాల్లోని డివిజన్లు ఈ కార్పొరేషన్ పరిధిలోకి రానున్నాయి
అలాగే సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోకి మియాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, మణికొండ, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, జీనోమ్ వ్యాలీ ప్రాంతాల్లోని డివిజన్లు ఈ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. అలాగే మల్కాజిగిరి కార్పొరేషన్‌కు మల్కాజిగిరి, అల్వాల్, ఉప్పల్, నాగోల్, కాప్రా, ఈసీఐఎల్, ఘట్‌కేసర్, కీసర, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లోని డివిజన్లు ఈ కార్పొరేషన్ పరిధిలోకి రానున్నాయి. అలాగే కొత్త కమిషనర్ల నియామకం కార్పొరేషన్ల ఏర్పాటుకు ముందే పాలనను పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను అదనపు కమిషనర్లుగా నియమించింది. సైబరాబాద్ పరిధిలోని జోన్లకు జి.సృజనను, మల్కాజిగిరి పరిధిలోని జోన్లకు టి.వినయ్ కృష్ణారెడ్డిని నియమించారు. కార్పొరేషన్లు అధికారికంగా రూపుదాల్చాక వీరే కమిషనర్లుగా బాధ్యతలు చేపడతారు. హైదరాబాద్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ కొనసాగుతారు.

**ఫిబ్రవరి 10 తర్వాతే...**

జిహెచ్ఎంసిని మూడు ముక్కలుగా చేసే ప్రక్రియ ఫిబ్రవరి 10తర్వాతనే మొదలుకానున్నట్లు తెలుస్తుంది. ఇదే విషయంపై ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలోనూ సీఎం రేవంత్ రెడ్డితో పలువురు మంత్రులు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో విషయంపై చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పాలక మండలి కొనసాగుతుండటంతో ఇప్పుడు ముక్కలు చేయడం కుదరదని, పాలకమండలి గడువు ఫిబ్రవరి 10న ముగిసిన తర్వాతే సాధ్య మని కొందరు అధికారులు అంటున్నారు. దీంతో ఫిబ్రవరి 10వరకు ఒక్కటే కార్పొరేషన్‌గా ఉంటుం దని, ఆ తర్వాతే స్పెషల్ ఆఫీసర్ పాలనతో పాటు కార్పొరేషన్లని విభజించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.


సి.ఎస్ రామకృష్ణారావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్లు


నూతన సంవత్సరం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

## నెహ్రూ జూలాజికల్ పార్కుకు సందర్శకుల తాకిడి

-పది రోజులలో లక్షా యాభై వేల మంది సందర్శకులు


సందర్శకులతో కిక్కిరిసిపోయిన జూ పార్కు

**చార్మినార్,జనవరి 1 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ గురువారం సందర్శకులతో కిక్కిరిసి పోయింది.నూతన సంవత్సరం సందర్భంగా 26 వేల మంది సందర్శకులు గురువారం జూ పార్కును తిలకించారు.వేలాది మంది పర్యాటకులు రావటంతో జూ పార్కు పరిసర ప్రాంతాలలో విపరీతమైన రద్దీ ఏర్పడింది.ఉదయం నుంచి సాయంత్రం ఐదున్నర గంటలు వరకు జూ పార్కు సందర్శకులతో కళకళలాడింది.జూ పార్కులోని జంతువులను పర్యాటకులు ఎంతో ఆసక్తితో తిలకించారు.సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ జూ పార్కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.కాగా పది రోజులలో లక్షా యాభై వేల మంది పర్యాటకులు జూపార్కును తిలకించారని జూపార్కు అధికారులు వెల్లడించారు.

## తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాలకు పరిమితం చేయొద్దు : సిపి

**హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త** నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. అత్యంత వినూత్నంగా ఒక మంచి సేవా కార్యక్రమంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల వుతోంది. నూతన సంవత్సర వేడుకలను కార్ఖానాలోని ఆర్కే ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నటి పావలా శ్యామ లను పరామర్శించారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా షేర్ చేశారు."నూతన సంవత్సర వేడుకలంటే కేవలం సంబరా లు, హంగులే కాదు.. ఆత్మీయతను పంచుకోవడం, బాధ్యత ను గుర్తుచేసుకోవడం. ఇదే సంకల్పంతో ఈ ఏడాది తొలి రోజును నిరాడంబరంగా, సేవా దృక్పథంతో ప్రారంభించానన్నారు. కష్టకాలంలో ఉన్న ఆమెను ఆదుకుని, ఈ హెల్త్‌కేర్ సెంటర్లో చేర్పించిన తిరుమలగిరి ఏసీపీ రమేష్ చొరవ అభినందనీయం" అని ప్రశంసించారు.


నటి పావలా శ్యామలను పరామర్శించి పండ్లు అందజేస్తున్న సీపీ సజ్జనార్

## గంజాయి మొక్కల సాగు కలకలం

-యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**అత్తాపూర్ జనవరి 1,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ ప్రాంతంలో గంజాయి మొక్కల సాగు కలకలం రేపింది. నిర్మానుష్యం ప్రాంతాన్ని ఎంచుకుని గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలను సాగు చేస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.గురువారం పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ పోలీసులు దాడులు నిర్వహించి యూపికి చెందిన రాజేందర్‌ను అరెస్టు చేశారు.గత నాలుగు నెలల నుండి గంజాయి సాగు చేస్తూ చుట్టుపక్కల ప్రాంతాల్లోని యువకులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు విచారణలో గుర్తించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


సాగు చేస్తున్న గంజాయి మొక్కలు దృశ్యం

## కొకైన్ డ్రగ్స్ స్వాధీనం

రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసులు బుధవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్డెన్ టెంపుల్ సమీపంలో డ్ర గ్స్ స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో రాజమండ్రికి చెందిన శ్రీనివాస్, గోవాకు చెందిన విజయ్‌లను అదుపులోకి తీసుకుని 7 గ్రాముల కొకైన్, రెండు ఫోన్లను సీజ్ చేశారు. నింది తులకు వైద్య పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ సేవించినట్లు (పాజిటివ్) తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

**జగద్గిరిగుట్ట, జనవరి 1, ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. మద్యం తాగి బిర్యాని తినడంతో ఒకరు మృతి చెందగా మరో 16 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ విషాదకర సంఘటన మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్టు పోలీస్ స్టేషన్ పరిధి భవానీనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బుధవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో బిర్యాని తిని మద్యం సేవించారు. వీరిలో పాండు (53) అనే వ్యక్తి మృతి చెందగా 16 మంది అస్వస్థతకు గురవ్వగా వారిని హాస్పిటల్లో చేర్పించి చికిత్స అంది స్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అబ్దుల్లాపూర్‌మెట్టు వద్ద కారు దగ్ధం

**హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త :** అబ్దుల్లాపూర్‌మెట్టు రామోజీ ఫిల్మ్ సిటీ ముందు ఓ కారు దగ్ధమైంది. క్యాబ్ డ్రైవర్ రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద ప్రయాణికులను దింపిన అనంతరం పార్కింగ్ స్థలంలో వాహనాన్ని నిలిపాడు. ఈ క్రమంలో డ్రైవర్ కారు నుంచి బయటకు రాగానే వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కాగా, దోమలగూడకు చెందిన వెంకటేష్‌కు చెందిన కారుగా పోలీసులు గుర్తించారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## అస్వస్థతకు గురైన భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను పరామర్శించిన శ్రీశైలం గౌడ్



భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని పరామర్శిస్తున్న శ్రీశైలం గౌడ్

**జీడిమెట్ల, జనవరి 1, ప్రభాతవార్త**

గాజులరామారం సర్కిల్ పరిధిలోని భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసుకున్న ఫంక్షన్‌లో ఫుడ్ పాయిజన్ అయ్యి తీవ్ర అస్వస్థతకు గురై సూరారం నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గురువారం భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, అస్వస్థకు గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడారు. హాస్పిటల్లో అస్వస్థతకు గురైన వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు అధైర్య పడవద్దని, త్వరలోనే కోలుకుంటారని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, సాయినాథ్ నేత తదితరులు పాల్గొన్నారు.

## ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగుల సంక్షేమ కోసం కృషి

### నూతన అధ్యక్షుడు పద్మారావు భరోసా

**సైఫాబాద్, జనవరి 1 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ, హక్కుల సాధన కోసం తనవంతు కృషి చేస్తానని ప్రెస్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు టి.పద్మారావు హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని, ఏమైన సమస్యలు ఉంటే సంఘం ద్వారా యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారించుకుందామన్నారు. గతంలో తాను పలు ఎస్సీ, ఎస్టీ సంఘాలకు అధ్యక్షుడిగా, ఎజి ఆఫీస్‌లో ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్‌గా, అంబేద్కర్ యువజన సంఘం ప్రదాన కార్యదర్శిగా పనిచేసిన అనుభవాలు ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం మోహనరావు, ప్రెస్ కార్యనిర్వాహకులు, సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మహంకాళి అమ్మవారి దేవాలయంలో రోహిన్ ముదిరాజ్ పూజలు



అమ్మవారి దేవాలయంలో రోహిన్‌ముదిరాజ్‌ను సత్కరించిన కమిటి సభ్యులు

**హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త:**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిన్‌ముదిరాజ్ గురువారం అంబర్‌పేటలోని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సేవా సమితి కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, కార్యదర్శి చంగలి సుధాకర్, సభ్యులు కోటం అనిల్‌కుమార్, దుసరి మహేష్‌గౌడ్, పిల్లి చంద్రశేఖర్, గడ్డం సునీల్‌గౌడ్, దోమకొండ తుకారం, పుట్ట సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి : వైష్ణవి యాదవ్



మారేడ్‌పల్లిలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు వైష్ణవి యాదవ్ తదిరులు

**అడ్డగుట్ట, జనవరి 1 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్ తెలిపారు. గురువారం మారేడ్‌పల్లి మైసమ్మ దేవాలయం వద్ద కిట్టు యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురవి శ్యాంసుందర్ రెడ్డి, విక్రమ్, నర్సింగ్, రవి, వాసు రెడ్డి, మైసమ్మ టెంపుల్ ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలి : జంపనప్రతాప్

**కంటోన్మెంట్, జనవరి 1 ప్రభాతవార్త:** పేదలకు అన్నదానం చేసేందు దాతలుముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. హ్యూమన్ పౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాశ్ బాటియా ఆధ్వర్యంలో గురువారం 1వ వార్డు బాపూజీ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులుప్రేమ్ ముదిరాజ్, అజిత్ కళ్యాణ్, నర్సింహ్మా, రామారావ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### తప్పిపోయిన బాలికను క్షేమంగా అప్పగించిన పోలీసులు




తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

**చాంద్రాయణగుట్ట, జనవరి 1 ప్రభాతవార్త :** తప్పిపోయిన ఒక బాలికను గంటల వ్యవధిలో వెతికిపట్టి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య కథనం ప్రకారం...వట్టేపల్లి ముహ్మదీయకాలనీ నివాసి మహ్మద్ జమీల్ పాషా కుమార్తె అలీషా (3) ఇంట్లో నుండి ఆడుకుంటూ వెళ్ళి ఉదయం 9 గంటల ప్రాంతంలో తప్పిపోయింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఎంత గాలించినా ప్రయోజనం లేకపోయింది. చివరికి పోలీసుల అత్యవసర ఫోన్ నెంబర్‌ను ఆశ్రయించారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పోలీసులకు బాలిక తప్పిపోయినట్లు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య వెంటనే కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, నర్సింహా, ప్రవీన్‌లను బాలికను వెతికి పట్టేందుకు రంగంలోకి దింపారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గంటల వ్యవధిలోనే తప్పిపోయిన అలీషాను క్షేమంగా కనుగొన్నారు. ఆ బాలికను స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలిక తండ్రి మహ్మద్ జమీల్ పాషా పోలీసులకు తగిన ఆధారాలు చూపటంతో అలీషాను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వారు పోలీసులకు ప్రత్యక కృతజ్ఞతలు తెలియజేశారు.

## గణేష్‌నగర్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి : కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్, జనవరి 1 ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ జోన్ పరిదిలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయబేరీ మోగించడంకోసం కలిసికట్టుగా శ్రమించాలని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ పిలుపునిచ్చారు. కొత్తసంవత్సర సందర్భంగా నూతనంగా ఏర్పడ్డ గణేష్‌నగర్ డివిజన్‌నుండి కాంగ్రెస్ పార్టీ గణేష్‌నగర్ నుండి పెద్దఎత్తున ఆయనను కలిసారు. ఈసందర్భంగా చింతకుంట వెంకటేశ్‌యాదవ్ నాయకత్వంలో కలిసిన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్‌కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో మమేకమై సమస్యల పరిష్కారంలో ప్రత్యేకశ్రద్ధచూపాలని సూచించారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో త్యధిక స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవాలంటే కాంగ్రెస్ గతరెండేళ్లలో చేసిన, చేస్తున్న అభివృద్ధితోపాటు ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్తగా డివిజన్ల అభివృద్ధికి కేటాయించిన



గణేష్‌నగర్ డివిజన్‌నుండి చింతకుంట వెంకటేశ్‌యాదవ్ నాయకత్వంలో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

నిధులను ప్రజల మౌళిక సదుపాయాల కల్పనకు వెచ్చించేలా సమస్యలపై పూర్తిఅవగాహణతో శ్రమించాలన్నారు. గణేష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట వెంకటేశ్‌యాదవ్ మాట్లాడుతూ కొత్తగా జీడిమెట్ల సర్కిల్ పరిధిలోకి వచ్చే 284డివిజన్ ఏర్పడిందని,కొత్తగా ఏర్పడ్డ డివిజన్ల సమస్యల పరిష్కారంపట్ల ప్రత్యేకశ్రద్ధ చూపాలని మాజీ ఎంఎల్ఏ శ్రీశైలంగౌడ్‌కు విజ్ఞప్తిచేశారు. అనంతరం 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సందేశాత్మక నాటకం ఎర్ర సింధూరం యాడబాయే తల్లి : కళా రత్న బిక్కి కృష్ణ

**చిక్కడపల్లి జనవరి 1 ప్రభాతవార్త :** సందేశాత్మక సాంఘిక నాటకం ఎర్ర సింధూరం యాడబాయే తల్లి నాటకం అని కళా రత్న బిక్కి కృష్ణ అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయణ గానసభలో భూగర్భ గనుల శాఖ పూర్వ డైరెక్టర్, ప్రముఖ కవి, శ్రీ వాల్మీకి మహర్షి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వీడి రాజ గోపాల్ నేతృత్వంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అతిధులుగా ఆదాయపుపన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమీషనర్ ఎం.నరసింహప్ప, డా వోలేటి పార్వతీశం, కంఠమనేని రవిశంకర్, "కళారత్న" బిక్కి కృష్ణ, డా. నాళేశ్వరం శంకరం, విశ్రాంత ఐ ఆర్ ఎస్ అధికారి జల్ది విద్యాధర్, రేలంగి నరసింహారావు, డా. యం.కె.రాము, డా. పి. విజయలక్ష్మి పండిట్, డా. మహ్మద్ రఫీ, యం. సిద్దారెడ్డి, ఎ.యల్. కృష్ణారెడ్డి , సాదనాల వేంకట స్వామి నాయుడు , రామకృష్ణ చంద్రమోళి, డా. రాధా కుసుమ, కళారత్న యం.కె.ఆశాలత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల కవులు సుమారు 50మంది కవయిత్రుల చే నేటి సమాజం అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం కవి రచయిత డాక్టర్ వీ.డి రాజ గోపాల్ రచించిన ఎర్ర సింధూరం యాడబాయే తల్లి సంచలనాత్మక సాంఘిక నాటకం ను పల్లోలి శేఖర్ బాబు దర్శకత్వం లో రాయల సీమ, జంట నగరాలకు చెందిన ప్రముఖ నటులు ప్రదర్శించారు. రెవిన్యూ శాఖ మంత్రి కలెక్టర్ ఆమెకు అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానం చేస్తారు. నాటకంలో అంతర్లీనంగా ప్రముఖ పౌరాణిక నటులు పుచ్చా సాంబశివా



కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత చీఫ్ కమీషనర్ ఎం.నరసింహప్ప, డాక్టర్ వీడి రాజగోపాల్, డాక్టర్ వోలేటి పార్వతీశం, బిక్కి కృష్ణ, జల్దీ విద్యాధర్ రావు తదితరులు

రెడ్డి ప్రదర్శించిన యమ సభ ఏక పాత్రాభినయం, ప్రముఖ పౌరాణిక నటులు కాటమ రాజు చే శ్రీ కృష్ణ ఏకపాత్రాభినం కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం కవులకు, నాటక కళాకారులు , పౌరాణిక నటులు పుచ్చా సాంబశివా రెడ్డి కి కాటమ రాజును డాక్టర్ వీడి రాజ గోపాల్ సన్మానం చేశారు. సంగీతం స్వర సామ్రాట్ డాక్టర్ శరత్ చంద్ర అందించగా సమన్వయం సాధనాల వెంకట స్వామి నాయుడు డాక్టర్ వేణు వందనం, ప్లేబ్యాక్ వ్యాఖ్యాత గా డాక్టర్ ఎం కె ఆశా లత, సభా కార్యక్రమ వ్యాఖ్యాతగా గాంధీ వ్యవహరించారు. ఈ సందర్భంగా డా. వి.డి.రాజగోపాల్ రచించిన భావాల పందిరి" కవితా సంపుటి, "ఎర్రసింధూరం యాడబాయ తల్లి" నాటక పుస్తకం, సంభాషణలు: పల్లోలి శేఖర్ బాబు, బాల బంధు గద్వాల సోమన్న రచించిన వెన్నెల నవ్వింది బాలగేయాల సంపుటి, "నేనొక విశ్వ వ్యాపకుడను" , కొప్పుల ప్రసాద్ కవితా సంపుటి , షిర్డీ సాయి నూతన కాలెండరు ఆవిష్కరణలు జరిగాయి.

### రిలేషన్షిప్ ది ఎసెన్స్ ఆఫ్ లైఫ్ పుస్తకావిష్కరణ



రాందేవ్ రావు ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 1, ప్రభాతవార్త :** రాందేవ్ రావు హాస్పిటల్‌లో జనవరి 1న ప్రముఖ రేఖి గ్రాండ్ మాస్టర్ లక్ష్మీ కమలాకర్ రచించిన రిలేషన్ షిప్స్ ది ఎసెన్స్ ఆఫ్ లైఫ్ పుస్తకాన్ని రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్, ఆసుపత్రి సీఈఓ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్లు, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కనుమరుగవుతున్న మానవ సంబంధాలు అనే అంశం మీద ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. జీవితం అనేది కేవలం సంఘటనల పరంపర కాదని, అది సంబంధాల ప్రయాణమని స్పష్టంగా వివరిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ఈ పుస్తకం సరళమైన హృదయానికి చేరువైన భాషలో అన్ని వయస్సుల పాఠకులను దృష్టిలో ఉంచుకుని రచించబడిందని తెలిపారు.

### సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే కాలేరు దంపతులు పూజలు



సాయిబాబా దేవాలయం పూజలు నిర్వహించిన కాలేరు దంపతులు

**హైదరాబాద్ జనవరి1, ప్రభాతవార్త :**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి కాలేరు పద్మ గురువారం అంబర్‌పేటలోని శ్రీసాయిబాబా ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, బాబా అశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గం ప్రజలకు, బాబా భక్తులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్వొకేట్ మధుసూదన్‌రెడ్డి, శ్రీరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన కాలేరు**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును గురువారం క్యాంప్ కార్యాలయంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మార్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావును ఆయన ఘనంగా సత్కరించారు.

### సుందరయ్య పార్క్ అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే



వాకర్స్ క్లబ్ అఫ్ బాగ్ లింగంపల్లి అధ్యక్షుడిగా ఎన్నికైన బి.వెంకటస్వామి గౌడ్ ను సత్కరిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి జనవరి 1 ప్రభాతవార్త :** సుందరయ్య పార్క్ అభివృధ్ధికి ప్రతిఒక్కరు సహకరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం వాకర్స్ క్లబ్ అఫ్ బాగ్ లింగంపల్లి అధ్యక్షుడిగా ఎన్నికైన బి.వెంకటస్వామి గౌడ్ తనతో పాటు క్లబ్ సీనియర్ ప్రతినిధులు బబ్లూ(వెంకటకృష్ణ), మన్నే దామోదర్ రెడ్డి, ఐలినేని కిషన్ రావు, చంద్రశేఖర్, రూపుల జయదేవ్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే ను కలిశారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ ఆప్యాయంగా వెంకటస్వామి గౌడ్ ను ఆలిగనం చేసుకుని సత్కరించారు. వెంకటస్వామి నిత్యం పేద ప్రజల కోసం పనిచేసే వ్యక్తి అని, వాకర్స్ క్లబ్ అఫ్ బాగ్ లింగంపల్లి అధ్యక్షుడిగా బి.వెంకటస్వామి గౌడ్ నేతృత్వంలో సుందరయ్య పార్క్ మరింత అభివృద్ధి కోసం కృషి చేస్తాడనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు.

### యాదవుల సమస్యలు పరిష్కారానికి కృషి : తలసాని



యాదవుల నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సైఫాబాద్, జనవరి 1 ప్రభాతవార్త:** జాతీయ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం నాడిక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని యాదవులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిఆర్ఎస్ తరపున యాదవులకు మరిన్ని టిక్కెట్లు కేటాయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే రాష్ట్రంలో యాదవులంతా ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కారానికి కూడ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం నాయకులు తలసాని ధర్మేందర్‌యాదవ్, టి.వేణుగోపాల్‌యాదవ్, రాజ్‌కుమార్‌యాదవ్, నక్కా ఉమేష్‌యాదవ్, ఆలం అంజయ్యయాదవ్, పాశం శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### మంద క్రిష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలిపిన శ్రీకిషన్

**కంటోన్మెంట్, జనవరి 1 ప్రభాతవార్త:**



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుకు శ్రీ కిషన్ మాదిగ గురువారం పద్మశ్రీ అవార్డు గ్రహిత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగకు శాలువకప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు



**అడ్డగుట్ట, జనవరి 1 ప్రభాతవార్త:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సనత్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌ను గురువారం మారేడ్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తలసానికి శాలువకప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మి బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణ గౌడ్, శేషుకుమారి, బిఆర్ఎస్ నాయకులు స్కైలాబ్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

### శ్రీనివాస్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువ



**నిజాంపేట్, జనవరి 1, ప్రభాతవార్త :** నూతన సంవత్సరం సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజలు, నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పోతర్ల రవీందర్ కె ఎస్ ఆర్ నూతన పాటను వారి చేతుల మీదుగా రిలీజ్ చేయించడం జరిగింది. తదనంతరం నిజాంపేట్ లోని వెలసినటువంటి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం, శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయాన్ని దర్శించుకున్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందాలి : కలెక్టర్ హరి చందన దాసరి

**హైదరాబాద్, డిసెంబరు 1,ప్రభాతవార్త:**

అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ఉద్యోగులు నూతన ఉత్సాహంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయనున్నట్లు తెలిపారు.ఈమేరకు గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, జితేందర్ రెడ్డి , డిఆర్ఓ ఈ వెంకటాచారి తో కలిసి ఆమె పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని ఆవిధంగా శాఖ అధికారులు ప్రత్యేక కృషి చేయాలని అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు, ఉద్యోగులు సిబ్బంది నూతన ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సిబ్బంది కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, సిపిఓ డాక్టర్, సురేందర్, సంక్షేమ అధికారులు అక్కేశ్వర రావు, జి ఆశన్న, ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటి, జిఎం పరిశ్రమలు పవన్ కుమార్, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ అధికారి రాజేందర్, అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా పౌరసంబంధాల అధికారులు

## ప్రెస్ క్లబ్ నూతన డైరీ ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త ;**

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2026 సంవత్సరానికి రూపొందించిన నూతన డైరీని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. సచివాలయంలోని ఆయన కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, వారి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. జర్నలిస్టులను అన్ని విధాల ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.విజయకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ .రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దేల్లి బాపూరావు, ఈసీ సభ్యులు ఎన్ .ఉమాదేవి, మర్యాద రమాదేవి, రాజేశ్వరి కళ్యాణం, శంకర్ సిగ, ముత్యాల సత్తిబాబు, నాగరాజు వనం, ఎన్. శ్రీనివాసరెడ్డి ,అశోక్ దయ్యాల, అమిత్ బట్టు సహ్ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఆర్. రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదే సందర్భంగా



హైదరాబాద్ ప్రెస్ క్లబ్ రూపొందించిన నూతన డైరీని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి,చిత్రంలో క్లబ్ ప్రతినిధులు విజయకుమార్‌రెడ్డి, రమేష్ వరికుప్పల,ఏ .రాజేష్ తదితరులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రెస్ క్లబ్ పక్షాన ఒక వినతి పత్రాన్ని పాలకమండలి సమర్పించింది. ముఖ్యమంత్రి దీనిపై సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు విజయకుమార్‌రెడ్డి రమేష్ వరికుప్పల మొక్కను అందజేసి శాలువాతో ఈ సందర్భంగా సత్కరించారు.

### లూయిస్ బ్రెయిలీ జయంతికి నవీన్ నికోలస్‌కు ఆహ్వానం



లూయిస్ బ్రెయిలీ జయంతికి పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌ను ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

**చాంద్రాయణగుట్ట, జనవరి 1 ప్రభాతవార్త :** పాతబస్తీ దారుల్‌షిఫా ప్రభుత్వ బాలుర ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ సోమవారం నిర్వహించే లూయిస్ బ్రెయిలీ 217 జయంతికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్‌కు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండడి వెంకట్‌రెడ్డితో కూడిన ప్రతినిధి బృందం డైరెక్టర్‌ను తన కార్యాలయంలో కలిసి ఈ మేరకు ఆహ్వానించారు. కార్యక్రమ విశేషాలను వివరించారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఉపాధ్యాయులు రామారావు, బసవరాజు, జానయ్యలు ఉన్నారు. కాగా ప్రాథమిక పాఠశాల కొరకు ఆయా అవసరాన్ని డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వివరించారు.

## కాంగ్రెస్ పార్టీకి మరింత మేలు చేకూరాలి



నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షులు దీపక్‌జాన్.

**బేగంపేట జనవరి 1,ప్రభాతవార్త**

ఈ ఆంగ్ల నామ సంవత్సరం లో కాంగ్రెస్ పార్టీకి మరింత మేలు చేకూరాలని,పార్టీలో చేరికలతో బూత్ స్థాయిలో మరింత పటిష్టానికి కృషి చేయాలని సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్ పిలుపు నిచ్చారు.గురువారం ప్యారడైజ్ హోటల్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం మాజీ ఏ బ్లాక్ అధ్యక్షుడు షేక్ గౌస్,యువ నాయకుడు అభిషేక్ అడపా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు.ముందుగా దీపక్ జాన్ కేక్ కట్ చేసారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్, సీ.రాజేందర్, హాజీటోచర్,మహ్మద్ ఫయాజ్,మునీర్‌ఖాన్, హనీఫ్, రమాదేవి,చంద్రకళ,ముష్రా,రాథ,తస్లీమ్,అల్తమాష్ మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

### - చైర్మన్ మారిశెట్టి నర్సింగ్ రావు



ప్రసంగిస్తున్న లక్ష్మీ గణపతి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్ రావు

**చిక్కడపల్లి జనవరి 1, ప్రభాతవార్త :**

దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లక్ష్మీ గణపతి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్ రావు అన్నారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకుడు వి. వేణుగోపాల రాజు చే ఎమ్మెస్ రామారావు రచించిన సుందరకాండ పారాయణం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దేవాలయం చైర్మన్ మారిశెట్టి నర్సింగ్ రావు మాట్లాడుతూ దేవాలయాలు కేవలం ప్రార్థనా స్థలాలే కాకుండా, భక్తులకు శాంతి, సానుకూల శక్తిని అందించే ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నారు. అందులో భాగంగానే లక్ష్మీ గణపతి దేవాలయాన్ని సౌకర్యాలను కల్పిస్తూ, అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కొత్త ఏడాది లో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. దేవాలయం ఈఓ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత. శీలం సత్యనారాయణ, ఎం శ్రీనివాస్, దేవాలయ కమిటీ సభ్యులు బండారు నవీన్.బాబ్జి,దోనేటి భానుచందర్, దినేష్, పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 68 మందిపై కేసులు

**చాంద్రాయణగుట్ట, జనవరి 1 ప్రభాతవార్త :** నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ ఆదేశాల మేరకు ఛత్రినాక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. శాలిబండ హిమ్మత్‌పురా కూడలి, ఛత్రినాక రాందాస్ గంజ్ కూడలి వద్ద తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు జరిగిన తనిఖీలలో పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. హిమ్మత్‌పురా కూడలిలో 13, ఛత్రినాక రాందాస్ గంజ్ కూడలిలో 9 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపిన 22 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరందరిని గోషామహల్‌లోని కౌన్సిలింగ్ కేంద్రానికి పంపించనున్నట్లు వివరించారు. ఆతరువాత ఛార్జ్‌షీట్ వేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు ఆధ్వర్యంలో బండ్లగూడ మొఘల్ కాలేజ్, డీఆర్‌డీఓ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మొఘల్ కాలేజ్ వద్ద 23, డీఆర్‌డీఓ వద్ద 23 కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ దాసు వెల్లడించారు. ఈ తనిఖీలలో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## గవర్నర్‌ను సన్మానించిన రాజస్తానీ జాగృతి సమితి

**హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త :**

రాజస్తానీ జాగృతి సమితి ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ సోమాని, మంత్రి మహేష్ అగర్వాల్, కోశాధికారి సంజయ్ రాఠీ, సంస్థాగత మంత్రి రమేష్ మోదానీ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తలపాగా, శాలువాతో పాటు ముత్యాలదండతో సన్మానించి జ్ఞాపికను బహుకరించారు.



గవర్నర్‌ను సన్మానిస్తున్న రాజస్తానీ జాగృతి సమితి ప్రతినిధులు శ్రీనివాస్ సోమాని, మహేష్ అగర్వాల్ తదితరులు

### అంబేద్కర్ వర్సిటీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

**జూబ్లీహిల్స్, జనవరి 1, ప్రభాతవార్త:**



డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ నూతన సంవత్సర 2026 డైరీ, క్యాలెండర్‌లను ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఉద్యోగులు రానున్న రోజుల్లో మరింత చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.యల్. విజయకృష్ణారెడ్డి, విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్పా చక్రపాణి, పలు విభాగాల అధిపతులు, డీన్లు అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినందుకు వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంతం ప్రేమ్‌కుమార్, ఎన్సీ వేణుగోపాల్, విశ్వనాథ్, భరత్ రెడ్డి, డా. యకేష్ దైదా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఉద్యోగులకు, విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

IN THE HON'BLE COURT OF III ADDL JUNIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT MEDCHAL
O.S. No. 905 of 2025

Between:
Mula Chandrakala w/o Late Mula Yadagiri ...Plaintiff
AND
The Tahsildar and another ...Defendants

To,
All Concerned

Take notice that the plaintiff herein filed the above suit for declaration to declare the plaintiff is only the legal heir of the deceased Late Mula Yadagiri, S/o. Mula Ashaiah, who died on 17-11-2024, and the suit is stands posted on 19-01-2026. If any person or persons having any objections or claims they may appear before the Hon'ble III Addl Junior Civil Judge Court at Medchal on 19-01-2026 at 10-30 a.m. either in person or through an advocate, failing which the matter will be decided basing on the documents available on record.

(By order of the Court)

M/s. MD RAHEEM PASHA
MA PRAVEEN KUMAR
Advocates
R/o. H.No.49-42, Cherkupally Colony Chintal, Hyderabad-500055. Cell: 9966994768
(Counsel for the Plaintiff)

## వెంకటేశ్వర దేవాలయం నూతన కార్యవర్గం ఎన్నిక



**సరూర్ నగర్ జనవరి1,ప్రభాతవార్త:** సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని, శ్రీ వెంకటేశ్వర కాలనీ లోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర దేవాలయం నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది. చైర్మన్ గా ధర్పల్లి అశోక్, వైస్ ఛైర్మన్ గా శాంతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గా ఎం. నాగభూషణ్ రావు, జాయింట్ సెక్రటరీ గా తులసీ కృష్ణ మూర్తి, కోశాధికారిగా ఆర్.శ్రీమన్నారాయణ, ధర్మకర్తలుగా కాలనీ అధ్యక్షులు గందు ధనం రెడ్డి, ఆర్. భోగేశ్వర్ రావు, జి. ప్రతాప్ రెడ్డి, ఆర్. విజయ్ కుమార్, గరగ సాయికుమార్, సత్యనారాయణ మూర్తి, టి. శ్రీనివాస్ రావు, ఎం.వీరేందర్ రెడ్డి, పి. శ్రీనివాస్ కుమార్, రాజశేఖర్, కే. వి. సుబ్బారావు లు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గం జనవరి 1వ తేదీ స్వామి వారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయం పూజారులు వంశధార చార్యులు, రామకృష్ణ చార్యులు, శ్యామ్ సుందర్ లు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయం శాశ్వత సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## యేసు క్రీస్తు మార్గం అందరికీ దిక్సూచి
### : పాస్టర్ సామ్యూల్ బాబు



బేతనియ బాప్టిస్ట్ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తున్న పాస్టర్ సామ్యూల్ బాబు తదితరులు

**మలక్ పేట, జనవరి 1, ప్రభాతవార్త:** ఏసుక్రీస్తు మార్గం అందరికీ దిక్సూచిగా నిలుస్తుందని బేతనియ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ బాబు పేర్కొన్నారు. ముసారంబాగ్ కృష్ణ తులసి నగర్ లోని బేతనియా బాప్టిస్ట్ చర్చి లో చర్చి పాస్టర్ సామ్యూల్ బాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రేమ, కరుణ ద్వారా మానవాళి జీవితంలో ఆనందం, సంతోషాన్ని నింపారని, ఏసుక్రీస్తు జీవితం అందరికీ అనుసరణీయమని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు మంచి నడవడిక గురించి తెలియజేస్తాయని వివరించారు. నూతన సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలు శాంతియుత వాతావరణం లో సోదర భావంతో కలిసిమెలిసి ఐక్యత భావంతో ప్రశాంతంగా జీవించాలని పేర్కొన్నారు.అదేవిధంగా చర్చిలో పలుభక్తి గీతాలను ఆలపించి వివిధ సంస్కృతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దైవ ప్రార్థన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో షీలాదోరాతి బైరపోగు, రెవరెండ్ శైలస్ రెజినాల్డ్ , సుమంత్ , సత్యానందం రేయు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : ఏసిపి



బధిర విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిల్లు అందజేస్తున్న ఏసీపీ సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్లు బ్రహ్మ మురారి, నాను నాయక్ తదితరులు

**మలక్ పేట, జనవరి 1, ప్రభాతవార్త:** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్ ఆదేశాల మేరకు దక్షిణ తూర్పు జోన్ డిసిపి చైతన్యకుమార్, అదనపు డిసిపి శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో మలక్ పేట్ నల్గొండ చౌరస్తాలోనీ బదిర పాఠశాల హాస్టల్ లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బదిర పాఠశాల విద్యార్థులతో కలిసి ఎసిపి సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి లు కేక్ కట్ చేసి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, భోజనం పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాలక్ పేట్, డబిర్ పూర ఇన్ స్పెక్టర్లు పిడమర్తి నరేష్ , నాను నాయక్ ,ఎస్ ఐ లు ఎల కృష్ణ, సురేష్ రెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గ ఆలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటి ప్రతినిధులు.

**వనస్థలిపురం. జనవరి.1.ప్రభాతవార్త** వనస్థలిపురం ప్రశాంత్ నగర్ లో గల శ్రీ కనకదుర్గ దేవస్థానంలో గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులు నూతన సంవత్సర (2026) క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సంరెడ్డి భుజంగ రెడ్డి,ప్రధాన కార్యదర్శి పిన్నింటి పద్మారెడ్డి,కోశాధికారి కొండ వీరేశలింగం, కన్వీనర్ రామస్వామి రెడ్డి,సహాయ కార్యదర్శి బూడిద జగన్మోహన్ రెడ్డి, గౌరవ సలహాదారు లక్కరాజు ప్రశాంత్ కుమార్,కార్యవర్గ సభ్యులు శ్రీరామచంద్ర మూర్తి కందికొండ కిరణ్ కుమార్,లగ్గోని సుధా పమిడి అరుణ తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీలో బిఆర్ఎస్ పక్ష ఉపనేతగా తనకు అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మహేశ్వరం శాసనసభ్యురాలు పట్లోళ్ళ సబిత ఇంద్రారెడ్డి

# మల్కాజిగిరిలో నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతం

## -మద్యం మత్తులో వాహనాలపై పోలీసుల ఉక్కుపాదం

**మల్కాజిగిరి, జనవరి 1,ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అనర్థాలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారని కమిషనర్ మహంతి సాగు తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి జనవరి 1 ఉదయం వరకు చేపట్టిన ప్రత్యేక చర్యలతో రోడ్లపై భద్రతను కట్టుదిట్టంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు 36 ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించి, మద్యం మత్తులో వాహనాలు నడిపిన 605 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. వీరిలో 230 మందికి మద్యం శాతం అత్యధికంగా ఉండగా, 8 మంది అత్యంత ప్రమాదకర స్థాయిలో మత్తులో వాహనాలు నడిపినట్లు పోలీసులు వెల్లడించారు.నిందితులందరినీ త్వరలో న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు, వారి డ్రైవింగ్ అనుమతులను స్వాధీనం చేసుకుని సస్పెన్షన్ కోసం సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు కమిషనర్ తెలిపారు. లబ్‌నగర్, వనస్థలిపురం, ఉప్పల్, కుషాయిగూడ ప్రాంతాల్లో ఎక్కువగా ఈ కేసులు నమోదయ్యాయని చెప్పారు.పోలీసులు చేపట్టిన కఠిన చర్యల కారణంగా మల్కాజిగిరి పరిధిలో ఎక్కడా పెద్ద రోడ్డు ప్రమాదాలు జరగలేదని కమిషనర్ స్పష్టం చేశారు. రోడ్డు భద్రత విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై ఇకపై కూడా ఎలాంటి సడలింపులు ఉండవని, ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని కమిషనర్ మహంతి సాగు హెచ్చరించారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, రోడ్లపై ప్రమాదాలకు దూరంగా ఉండాలని మల్కాజిగిరి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# 5న అత్యవసర సమావేశం ఏర్పాటుకు ఎండీకి లేఖ

## -చైర్మన్ ను తొలగించడమే ప్రధాన ఎజండా

**హయత్ నగర్, జనవరి 1 ప్రభాతవార్త :** నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధు సూదన్ రెడ్డి ని పదవి నుండి తొలగించి నూతన చైర్మన్ ను ఎన్నుకోవడానికి ఈనెల 5న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరుతూ 11 మంది పాలక వర్గ సభ్యులు సంస్థ ఎండీకి లేఖను అందించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా పాడి రైతులు పాలను ఇతర డైరీలకు పోస్తున్నారని తెలిపారు. పాల బిల్లుల చెల్లింపు విషయమై చర్చించడానికి గత నెల 31న అత్యవసర సమావేశం నిర్వహించాలని 30న నోటీసు అందించామని డైరెక్టర్లు తెలిపారు. అయినా చైర్మన్ సమావేశానికి రాలేదన్నారు. బిల్లుల బకాయిల చెల్లింపులో చైర్మన్ విఫలమయ్యారని వారు ఆరోపించారు. యూనియన్ మనుగడను దృష్టిలో ఉంచుకుని యూనియన్ బైలా 26.3 (బి) ప్రకారం ప్రస్తుత చైర్మన్ ను తొలగించి నూతన చైర్మన్ ను ఎన్నుకోవడానికి తాము నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 5న ఉదయం 11 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహణకు ఎండీని కోరామన్నారు. ఈ విషయం పై ఎండీ ని సంప్రదించగా 11 మంది డైరెక్టర్లు లేఖను అందించిన విషయం వాస్తవమేనన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి : కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి



అనిబిసెంట్ ఉమెన్స్ కళాశాలలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తున్న విద్యార్థులు, చిత్రంలో కళాశాల అధ్యాపకులు

**మలక్ పేట, జనవరి 1, ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని అనిబిసెంట్ ఉమెన్స్ కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. అనిబిసెంట్ ఉమెన్స్ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కళాశాల అధ్యాపకులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంకుటిత దీక్ష, పట్టుదల, క్రమశిక్షణతో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. అత్యుత్తమ అధ్యాపక బృందంతో ఆధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామనీ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ దయాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజవల్లి,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 1 ప్రభాతవార్త:** ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వ కంగా కలిసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పూల మొక్కను అందజేశారు.

## హుడా వీకర్ సెక్షన్ కాలనీలో వీధి సూచికల బోర్డుల ఏర్పాటు



వీకర్ సెక్షన్ కాలనీలో వీధి సూచికల బోర్డును ఏర్పాటు చేసిన దిండు భూపేష్‌గౌడ్

**సరూర్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా సమీపంలోనున్న లెనిన్‌నగర్ హుడా కాలనీ వీకర్ సెక్షన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన కాలనీ వీధుల సూచిక బోర్డులను గురువారం బిఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు దిండు భూపేష్‌గౌడ్ ప్రారంభించారు. వీకర్ సెక్షన్లు కూడా కాలనీలకు ధీటుగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆయన తన స్వంత డబ్బులతో హుడా వీకర్ సెక్షన్ కాలనీలో వీధుల సూచిన బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జటావత్ రవినాయక్, మహేష్‌కుమార్, నాగరాజు, ఆంజనేయులు, దశరథ, రాకేష్, ఎస్‌కె షహీద్, రవీందర్ పాల్గొన్నారు.

## సబితమ్మకు టిఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు



సబితాఇంద్రారెడ్డికి పుష్పగుచాన్ని అందజేస్తున్న అరవిందశర్మ

**ఎల్.బి.నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆధ్వర్యంలో ఆమె నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సవితమ్మకు శాంతి అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెంట్యాల నాగేష్, నాయకులు రామాచారి, ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, కొండ్రు శ్రీనివాస్, సాజిద్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వెంకటేష్‌గౌడ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



**ఉప్పల్, జనవరి 1 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో నూతన సంవత్సరం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం శ్రీ మానస స్కూల్ అఫ్ డాన్స్ నిర్వహకురాలు ప్రణవి తుమ్మటి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో అలరించింది. ఈ సందర్భంగా వినాయక కౌతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, తారంగం, అన్నయ్య కీర్తన, రామదాసు కీర్తన, శబ్దం, స్తుతి అంశాలను కళాకారులూ సింధు,పూర్వీక, శాన్వి, సహస్ర, రిషిక,, అధ్య, అక్షర, లీలావర్షిణి , అలేఖ్య, నాగ మానస తదితర ప్రదర్శనలు నిర్వహించారు

## 1న సెలవు దినంగా ప్రకటించాలి : మత్తయ్య



ఉప్పల్‌లో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేస్తున్న జేరూసేలం మత్తయ్య తదితరులు

**ఉప్పల్, జనవరి 1 ప్రభాతవార్త :** జనవరి ఒకటిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిచాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరూసలేం మత్తయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేరూసేలం మత్తయ్య మాట్లాడుతూ జనవరి 1న ప్రపంచ ప్రఖ్యాత క్రైస్తవ మత విశ్వాసాల పండగ ఏసుక్రీస్తు జననం సందర్భంగా ఏర్పడిందని, కొత్త ఏడాదిలో అన్ని మతాలకు చెందిన వారు ఆధ్యాత్మిక వాతావరణంలో నూతన సంవత్సరం ప్రారంభం అవ్వాలని కోరుకుంటారని తెలిపారు. ప్రభుత్వం దీనిని గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఎపిలో సెలవు దినం ప్రకటించారని, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా వెంటనే సెలవు దినంగా ప్రకటిచాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పార్టీల విధానాలను అనుసరించాలని డిమాండ్ చేశారు.

## రామచంద్రస్వామి ఆలయంలో ఘనంగా కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు దృశ్యం.

**ఉప్పల్, జనవరి 1 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా గురువారం స్వామి వారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు మోత్కూరు రాఘవదాసు, కృష్ణ శర్మ (దేవి ప్రసన్న శర్మ), వేంకటేశ్వర శర్మ, ప్రసాద్ శర్మ,విజయేంద్ర, హరీష్ కుమార్ శర్మ, అక్షయ్ శర్మ తదితరుల ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ పండితులు మాట్లాడుతూ ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఏటా స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. స్వామి వారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

## రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వేగవంతంగా అభివృద్ధి



రేవంత్‌రెడ్డికి పుష్పగుచాలని అందజేస్తున్న భాస్కర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తుందని టీపీసీసీ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నా యకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన సంవ త్సరం 2026ను పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సంద ర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయ కత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసు కుపోతోందన్నారు.ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నా రు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

## శాసనసభలో స్వర్ణకారుల సమస్యలు ప్రస్తావించడంపై హర్షం



ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి

**సైదాబాద్, జనవరి 1 ప్రభాతవార్త:** స్వర్ణకారుల సమస్యల గురించి శాసనసభలో మాట్లాడిన రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్‌ను మణికొండలోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ ప్రభావంతో వృత్తినే నమ్ముకున్న విశ్వబ్రాహ్మణులు ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయాన్ని శాసనసభలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి తమ సంఘం సభ్యులతో పాటు ఎమ్మెల్యే ఠాకూర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకుని విశ్వకర్మలను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెపురి వెంకటస్వామి, కార్యదర్శి సతీష్ చారి, సలహాదారులు గౌరోజు రత్నమాచారి, సహాయ కార్యదర్శులు కొక్కొండ రమేష్ బాబు, గుగ్గిళ్ల రవీంద్రచారి, సుంకోజు పోతులూరి చారి, వెంకటాచారి పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం



**సైదాబాద్, జనవరి 1 ప్రభాతవార్త:** ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా చారిత్రక కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో క్యూ లైన్లు రోడ్డు మీదకు వచ్చాయి. 50 వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దేవాలయ కార్యనిర్వాహణాధికారి లావణ్య, పాలకమండలి సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.

## ప్రజలు సత్యమార్గాన్ని అనుసరించాలి : పాస్టర్ ప్రభు చరణ్



క్రిస్టియన్ లైఫ్ సెంటర్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న పాస్టర్లు ప్రభు చరణ్ ,వన్య ఇమ్మానుయేల్ తదితరులు

**మలక్ పేట , జనవరి 1, ప్రభాతవార్త:** ప్రజలు సత్యమార్గాన్ని అనుసరించాలని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, సీనియర్ పాస్టర్ ప్రభు చరణ్, పాస్టర్ వన్య ఇమాన్యుల్ లు పేర్కొన్నారు. ముసారాంబాగ్ లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో వారి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమ, కరుణ ద్వారా ఏసుక్రీస్తు మానవాళిలో ఆనందాన్ని, సంతోషాలను నింపారని పేర్కొన్నారు. సోదర భావంతో శాంతియుత వాతావరణంలో కలిసిమెలిసి ప్రశాంతంగా సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. శాంతి, కరుణ సహనం, ప్రేమ విలువల గురించి ఏసుప్రభువు సర్వ మానవాళికి తెలియజేశారని వివరించారు. అదేవిధంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చెసి పలు సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్ రాగుల



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రాగుల.

**వనస్థలిపురం జనవరి1.ప్రభాతవార్త.** నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు.గురువారం రెడ్ వాటర్ ట్యాంక్ సమీపంలోని ప్లే పార్కు ను సందర్శించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు భూగర్భ డ్రైనేజీ ,వీధి దీపాలు,పార్కు లో విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కార్పొరేటర్ కు తెలిపారు. సమస్యలను తెలుసుకున్న కార్పొరేటర్ రాహుల సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారాని కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రేడియో కాలనీ అధ్యక్షుడు కటకం వెంకటేష్,స్థానిక ప్రజలు శ్యామ్, కాశి,రాజేందర్,రాంబాబు,రమేష్ బాలరాజ్ గుప్త పాల్గొన్నారు.

## సుభాన్‌రెడ్డికి తీగల కృష్ణారెడ్డి పరామర్శ



సుభాన్‌రెడ్డిని కలిసిన మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** విశ్రాంత జీవితం గడుపుతున్న రాజకీయ కురు వృద్ధుడు, భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం మాజీ ఛైర్మన్, అల్మాస్‌గూడ గ్రామ మాజీ సర్పంచ్, నవీన సంస్థల అధినేత చప్పిడి సుభాన్‌రెడ్డిని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్, మాజీ హుడా ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి పరామర్శించారు. నూతన సంవత్సర ప్రారంభం రోజు గురువారం పలువురు నాయకులు, అనుచరులతో కలిసి హస్తినాపురంలోని సుభాన్‌రెడ్డి నివాసానికి తరలివచ్చిన తీగల ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆరోగ్యం, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం తీగల మాట్లాడుతూ సుభాన్‌రెడ్డితో తనకు కొన్ని దశాబ్దాలుగా మంచి అనుబంధం ఉన్నదని గుర్తు చేశారు. తీగలతో పాటు సుభాన్‌రెడ్డిని కలిసి నవారిలో భాగ్యనగర్ సొసైటీ మాజీ డైరెక్టర్ కుంచ నాగేందర్‌గౌడ్, మీర్‌పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ పల్లె జంగయ్యగౌడ్‌లతో పాటు మల్గారి ఉపేందర్‌రెడ్డి, పెండ్యాల సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరరించిన సబితారెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో మాజీ ఎంపిపి జిల్లెల కృష్ణారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ నాయకుడు ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మాజీ విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. శ్రీనగరంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్ ప్రప్రథమ అధ్యక్షుడు జిల్లెల కృష్ణారెడ్డి, తెలంగాణ బంజార సంఘం రాష్ట్ర నాయకుడు దీప్‌లాల్ చౌహాన్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ నేతలు దోమలపల్లి రాజ్‌కుమార్, దయానంద్ ముదిరాజ్, మేకల యాదగిరి, దండు మహేందర్, దుంపల ప్రభాకర్, కృష్ణ యాదఒవ్ చందు, శివ, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి రాఘవేందర్ రెడ్డి శుభాకాంక్షలు



సచివాలయంలో సిఎంను సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ఎఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్, యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సమేతంగా సచివాలయానికి తరలివచ్చిన రాఘవేందర్‌రెడ్డి అక్కడ సిఎంను కలిసి మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపిని కలిసిన చల్లా



మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపికి పుష్పగుచ్ఛాన్నిస్తున్న టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** మాజీ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ రాజకీయవేత్త కెవిపి రామచంద్ర రావును తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టియుఎఫ్ఐడిసి) ఛైర్మన్, రంగారెడ్డి డిసిసి చీఫ్ చల్లా నర్సింహారెడ్డి కలిసారు. నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని కెవిపి నివాసానికి తరలివెళ్ళిన చల్లా అక్కడ రామచంద్రరావును కలిసి పుష్పగుచ్ఛాన్నిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కూడా చల్లా నర్సింహారెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో బిఆర్ఎస్ నేతల బేటి



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ నేత అన్న బాలకృష్ణ తదితరులు

**ఉప్పల్, జనవరి 1 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని గురువారం ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్‌లకు చెందిన పార్టీ నేతలు బేటి అయ్యారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని పలువురు నేతలు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నేత అన్న బాలకృష్ణ, మేడిపల్లి నవీన్‌చారి తదితరులు కలిసి సత్కరించారు. ఉప్పల్ డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే తగు సహకారం అందిస్తున్నారని తెలిపారు. అదే విధంగా చిలుకానగర్ బిఆర్ఎస్ పార్టీ నేతలు పిట్టల నరేష్ ముదిరాజ్ కొంపల్లి రవీందర్, కొంపల్లి రాజ్ కుమార్, సీత రాజు, బొబ్బల నవీన్‌రెడ్డి, నరేష్, సాయి గుప్తా, శివ గుప్తా, ప్రవీణ్, నాగరాజు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి సత్కరించారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



సిఎం రేవంత్‌రెడ్డితో బేటి అయిన జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 1 ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డితో గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కొత్త ఆంగ్ల సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కెటిఆర్‌కు కార్పొరేటర్ బన్నాల గీత సత్కారం



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి సత్కరిస్తున్న కాంగ్రెస్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జనవరి 1 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్‌తో గురువారం పలువురు పార్టీ నేతలు బేటి అయ్యారు. చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తోపాటు, పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, పరూక్, శ్యామ్, బాలు, తదితరులు కేటీఆర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే చిలుకానగర్ డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆంగ్ల నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.